

బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వం

బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోం దని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు.

- 8లో▸



క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. జనగామలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం

37.9^0 /22.5^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరం గా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

‘జలజీవన్’ను సద్వినియోగం చేసుకోండి

- కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ జలజీవన్ ప్రభుత్వ సెక్రటరీ సుమిత్ ఝా

జనగామ: దేశంలో ప్రతీ ఇంటికి తాగునీటిని అందించడంతో పాటు నీటి సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న జలజీవన్ ప్రోగ్రామ్ సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ జలజీవన్ ప్రభుత్వ సెక్రటరీ సుమిత్ ఝా అన్నారు. కేంద్ర జలజీవన్ కార్య క్రమాలపై ప్రభుత్వ సెక్రటరీ సుమిత్ ఝా గురువారం న్యూఢిల్లీ నుంచి దేశంలోని అరు ణాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణలో అమల వుతున్న జలజీవన్ పథకాల తీరుతెన్నులకు సంబంధించి ఆయా రాష్ట్రాల జిల్లాల కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఇం దులో హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యాలయం నుంచి మిషన్ భగీరథ ఇంజనీరింగ్ ఇన్‌చీఫ్ ప్రభాకర్ రెడ్డి, జనగామ నుంచి జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా పాల్గొన్నారు. ఈసందర్భంగా సుమిత్ ఝా మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పరిధిలో తెలంగాణ రాష్ట్రంలో 17 జిల్లాలతో పాటు దేశవ్యాప్తంగా 31 ఉండగా, ఇక్కడ అమ లు చేస్తున్న జలజీవన్ మిషన్ పనుల పురోగ తికి సంబంధించి కలెక్టర్‌ను అడిగి తెలుసుకు న్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో కేంద్ర జలజీవన్ మిషన్ కింద అమల వుతున్న కార్యక్రమాలు విజయవంతంగా కొన సాగుతున్నాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం



జనగామ: జనగామ కలెక్టరేట్‌లో గురువారం ఆర్డీవో గోపీరామ్‌తో కలిసి సమాచార కమిష నర్ అయోధ్యరెడ్డి పెండింగ్‌లో ఉన్న సమాచా ర హక్కు చట్టం దరఖాస్తులను పరిశీలించారు. వివిధ శాఖలకు చెందిన 36 దరఖాస్తులను పరిశీలన పూర్తిచేయగా చేయగా, కొన్ని ప్రాసె స్‌లో ఉన్నాయి. కార్యక్రమంలో జిల్లా ఉన్నతా ధికారులు అంబికాసోని, రాణాప్రతాప్, రవీం దర్, విక్రమ్‌కుమార్, మాధవిలత ఉన్నారు.

బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలి



జనగామ రూరల్: బంజారా సామాజిక వర్గా నికి మంత్రి పదవి ఇవ్వాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు దరావత్ శంకర్‌నాయక్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని విజయ ఫంక్షన్ హాల్ లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య నాయ కుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భం గా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో లక్షల సంఖ్యలో బంజారాలు ఉన్నా, మంత్రిపదవిని కూడా ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు ధరావత్ భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రమేశ్, మోహన్, మూడవత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటుపై సమరం

పిల్లల భవిష్యత్‌ను ఆగం చేయవద్దంటున్న తల్లిదండ్రులు

- ఎంఈవోల తప్పిదాలతో పలు పాఠశాలలకు అన్యాయం
- టీచర్లను రిలీవ్ చేయని హెచ్‌ఎంలు..
- చేయాల్సిందే అంటూ ఎంఈఓల హుకుం
- ప్రైవేటు బాటపట్టేందుకు సిద్ధమవుతున్న పిల్లలు
- అగమ్యగోచరంగా జిల్లా విద్యాశాఖ



గండిరామారం యూపీఎస్ వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

జనగామ: జిల్లా విద్యాశాఖలో టీచర్ల సర్దుబాటు చిలికిచిలికి గాలివానలా మారుతోంది. బెత్తం ఉన్నో ళ్లదే పెత్తనం అనే చందంగా సర్దుబాటు ప్రక్రియ జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. పైరవీకారుల మాటలు విన్న అధికారులు చివరకు చేతులు కాల్చు కునే పరిస్థితికి దిగజారిపోయింది. వారం రోజులు గా రగులుతున్న ఈ మంటలు..ప్రస్తుతం పిల్లల తల్లిదండ్రులు రంగంలోకి దిగి ప్రత్యక్ష యుద్ధం చేసే పరిస్థితికి వెళ్లిపోతోంది. సర్దుబాటుపై టీపీటీ ఎఫ్ ఉపాధ్యాయ సంఘం ముందుకొచ్చి ఎంఈఓ ల తప్పిదాలు, అనాలోచిత నిర్ణయాలు, లోపాయి కారి ఒప్పందాలపై జిల్లా విద్యాశాఖ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో సర్దుబాటు జాబితాకు నిప్పు మరింత అంటుకుంటోంది. ఇంత జరుగుతున్నా ఎంఈఓలు మాత్రం తమ నైజాన్ని ప్రదర్శిస్తున్నారనే ప్రచారం లేకపోలేదు. నిబంధ నల మేరకు పనిచేస్తున్న టీచర్లను కుదించి..వెంటనే మరో చోటకు వెళ్లాలని హుకుం జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. అడ్డగోలుగా సర్దుబాటు చేసి, పిల్లల జీవితాలను ఆగం చేస్తామంటే చూస్తూ ఊరుకోమ ని సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు టీచర్లను రిలీవ్ చేయడం లేదు. దీంతో చిర్రెత్తిపోతున్న ఎం ఈవోలు తమ ఆదేశాలు బేఖాతర్ చేస్తారా అంటూ పరోక్ష బెదిరింపులకు దిగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 109 మంది టీచర్లను సర్దుబాటు చేయగా, ఇందులో అనేక చోట్ల నిబంధ నలు ఉల్లంఘించినట్లు సమాచారం. దీనిపై ఐఏఎస్ ఆఫీసర్, జిల్లా విద్యాశాఖ అధికారి నివేదికలను కోరగా, సర్దుబాటు ప్రాసెస్ మాత్రం యథావిధిగా జరిగిపోతోంది.

తెరపైకి పైరవీకారులు


టీచర్ల సర్దుబాటు విషయమై నెలకొన్న గందరగోళ పరిస్థితులను సాక్షి వరుసగా కథనాలను అందిస్తూ భ్రష్టు పట్టిపోతున్న విద్యాశాఖను మేలుకొలిపే ప్రయత్నం చేస్తోంది. సర్దుబాటులో ఆయా పాఠశా లలకు అన్యాయం చేస్తూ పిల్లల భవిష్యత్తును అంధ కారం చేస్తున్నారని సహచర టీచర్లు నెత్తి, నోరు మొత్తుకుంటున్నా ఉన్నతాధికారులకు మాత్రం వినిపించడం లేదు. ఇతర పాఠశాలలకు తాత్కాలిక బదిలీతో పాటు సంఘాల్లో పనిచేస్తున్న వారి బడు లకు అదనంగా సర్దుబాటు చేసుకున్న ఉపాధ్యా యులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొం తమంది పైరవీకారులు ఈ జాబితాలో చేతు లుపెట్టారనే ప్రచారం వినిపిస్తోంది. పిల్లల సంఖ్య ఎక్కువగా ఉండి సర్దుబాటులో తగ్గిపోయిన బడుల నుంచి..వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు బడులకు పంపించేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

గండిరామారం యూపీఎస్ ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

నర్మెట మండలం గండిరామారం ప్రాథ మికోన్నత పాఠశాల ఎదుట గురువారం తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. టీచర్ల సర్దు బాటు పేరుతో పిల్లలకు అన్యాయం చేయవద్దని ఆందోళన చేపట్టి పెద్దపెట్టున నినాదాలు చేశారు. యూపీఎస్‌లో గతంలో 40 మంది వరకు విద్యార్థులు ఉండగా, బడిబాటలో మరో 30 మంది కొత్తగా అడ్మిషన్లు తీసుకున్నారు. ఇం దుకుగాను నలుగురు ఎస్జీటీలు, ఒక స్కూల్ అసిస్టెంట్ పిల్లలకు పాఠాలను బోధిస్తున్నారు. ఇటీవల చేసిన సర్దుబాటులో ఈ పాఠశాలకు చెందిన ఎస్జీటీని ఓ పాఠశాలకు పంపించి, ఇక్కడకు మరో స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యా యున్ని (స్కూల్ అసిస్టెంటు)వేశారు. ఆ పాఠశా లలో పిల్లల సంఖ్యకు తగ్గట్టుగా టీచర్లు ఉన్నా రని, ఎస్ఏను రిలీవ్ చేసే పరిస్థితి లేదని హెచ్ ఎం తేల్చిచెప్పడంతో గందర గోళ పరిస్థితి నెల కొంది. దీంతో గండిరామారం యూపీఎస్ టీచ ర్‌ను సైతం రిలీవ్ చేయకుండా తల్లిదండ్రులు అడ్డుకున్నారు. కలెక్టర్ దీనిపై స్పందించి, తమ పిల్లల భవిష్యత్తు ఆగం కాకుండా చూడాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

- జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసిన వాతావరణ శాఖ
- అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా
- క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశాలు



బచ్చన్నపేటలో కురుస్తున్న భారీ వర్షం



కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ: జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రుతుపవన ద్రోణి ప్రభావంతో అతి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. గురువారం రాత్రి 10.30 గంటలకు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పోలీసు, రెవెన్యూ, విద్యుత్, ఇరిగే షన్, తదితర అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.. భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చ రికలతో 12 మండలాల పరిధిలో లోతట్టు ప్రాం తాలు, కల్వర్టులు, ప్రమాదకరంగా ఉన్న రహదారు లు, పెంకుటిళ్లు, విద్యుత్‌కు సంబంధించి ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికార యం త్రాంగం నిఘా వేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా కల్వర్టుల వద్ద జాగ్రత్తగా ఉం డాలని అప్రమత్తం చేశారు. జనగామ–నర్మెట ప్రధాన రహదారి గానుగుపహాడ్ తాత్కాలిక మట్టి రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో భారీ వర్షాలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనే భయాం దోళన నెలకొంది. అలాగే పాలకుర్తి రూట్‌లో కుందారం, బచ్చన్నపేట–కొన్నె ప్రధాన రహదారి వెంట ఉన్న కల ్వర్టులు, జఫర్‌గడ్, రఘునాథనాపల్లి, నర్మెట, స్టేషన్ ఘన్‌పూర్, దేవరుప్పుల తదితర మండలాల పరిధిలోని పల్లెలకు వెళ్లే దారులు, మధ్య మధ్యలో వచ్చే కల్వర్టులపై అధికారులు నిఘా పెంచాల్సిన అవసరం ఉంది. గత అనుభవాలను దృష్టిలో ఉం చుకుని ప్రజలకు ఎలాంటి కష్టాలు ఎదురుకాకుం డా ముందస్తు చర్యలు తీసుకోవాలి. జిల్లాలో రాత్రి 10 గంటల వరకు కొడకండ్లలో 75 మిల్లీ మీటర్లు, దేవరుప్పులలో 72.3మి.మీ, పాలకుర్తిలో 62.0 మి.మీ, బచ్చన్నపేటలో 19.5 మి.మీ, లింగాలఘన పురంలో 3.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

కాలువ పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు

రఘునాథపల్లి: అశ్వరావుపల్లి రిజర్వాయర్ కుడి కాలువ కెనాల్ నుంచి ఫత్తేషాపూర్ చెరువును నింపే కాలువను గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపా ధ్యక్షుడు లింగాల జగదీశ్‌చందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ పరిశీలించారు. ఈసంద ర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. ట్రైబల్ వెల్ఫేర్ నిధుల నుంచి ఆయా గ్రామస్తుల కోరిక మేరకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి రూ.9 కోట్లు మంజూరు చేయించారన్నారు. ఈ నిధులతో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించేందుకు అధికారులతో కలిసి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, హయ్యద్ అలీ, విరోజి, కరుణాకర్, సత్యనారాయణ, మోహన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు అందజేయాలి

- పెన్షనర్ల సాధన పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి

చిల్పూరు: రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే అందజేయాలని పెన్షనర్ల సాధన పోరాట సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఇనుగాల ఇంద్రసేనారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మం డల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. కోర్టు ఆదేశాలతో అందరికీ పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని చెప్పి ఒకరిద్దరికి మాత్రమే అందించే ప్రయత్నం చేయవద్దన్నారు. 2024 నుంచి ఉద్యోగ విరమణ పొందిన ప్రతీ ఒక్కరికి అందజేయాలని డిమాండ్ చేశారు.

నేతన్నలను ప్రోత్సహిద్దాం

- చేనేత వస్త్రాలు ధరించి వారికి అండగా ఉందాం
- దేశ ఆర్థిక వ్యవస్థలో చేనేత కీలకపాత్ర
- జాతీయ చేనేత దినోత్సవంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా



పట్టుచీరల స్టాల్స్‌ను సందర్శించిన కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు

జనగామ: కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగి స్తున్న చేనేత కార్మికులకు అండగా నిలిచేందుకు నేత వస్త్రాలను ధరించి వారిని ప్రోత్సహిద్దామని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పిలుపునిచ్చారు. జాతీయ చేనే త దినోత్సవం పురస్కరించుకుని గురువారం ము న్సిపల్ కార్యాలయంలో చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యం లో పెద్దఎత్తున సంబురాలు నిర్వహించారు. వేడుక లకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..చేనేత రంగం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూ పమని, దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తోం దన్నారు. భారతీయ చేనేత పరిశ్రమలో పనిచేస్తున్న లక్షలాది కార్మికుల కృషి, నైపుణ్యాలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. నేతన్న బీమా పథ కం ద్వారా రూ.1.20కోట్ల చెక్కును లబ్ధిదారులకు కలెక్టర్ అందించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన పట్టుచీరలు, ఇతర చేనేత వస్త్రాల స్టాల్స్‌ను సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకురాలు చౌడేశ్వరి, జిల్లాలోని చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

కార్పొరేట్ దోపిడీని వ్యతిరేకించాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య



మాట్లాడుతున్న రాపర్తి సోమయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: దేశంలో కార్పొరేట్ల దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు ఐక్య పోరాటాలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షు డు రాపర్తి సోమయ్య పిలుపునిచ్చారు. బ్రిటిష్ పాల నకు వ్యతిరేకంగా జరిగిన క్విట్ ఇండియా ఉద్యమ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 13న బహుళ జాతి కంపెనీలు భారతదేశాన్ని, భారత వ్యవసా యాన్ని విడిచి వెళ్లిపోవాలంటూ చేపట్టనున్న నిర సన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను మండలంలోని ఇప్పగూడెంలో గురువారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హా జరైన సోమయ్య మాట్లాడుతూ.. అమెరికా సామ్రా జ్యవాదానికి మోదీ ప్రభుత్వం లొంగొద్దన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కుమారస్వా మి, శ్రీను, మొగిలి, రమేశ్, వెంకటయ్య, సోమ య్య, గోపయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలి

- 12న పాలకుర్తికి మంద కృష్ణమాదిగ..
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సునీల్ మాదిగ

పాలకుర్తి టౌన్/పాలకుర్తి: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వికలాంగులకు పింఛన్ రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళ లకు రూ.4 వేలు పెంచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జనగామ జిల్లా ఇన్‌చార్జ్ బోడ సునీల్‌మాదిగ డిమాండ్ చేశారు. గురువారం మం డల కేంద్రంలోని బాషారత్ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంపీఎస్, వీహెచ్‌పీఎస్ జిల్లా స్థాయి సమావేశం ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బోడ సునీల్ మాదిగ మాట్లాడుతూ.. పెన్షన్లు పెంచాలనే డిమాం డ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా ఈనెల 12న పాలకుర్తిలో చేయూత పిం ఛన్‌దారుల మహాసభకు ముఖ్యఅతిథిగా మంద కృ ష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు. సమావేశం లో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్, బిర్రు నాగేశ్, గద్దం సోమరాజు, సందెన రవిందర్, చెరుపెల్లి యాదగిరిస్వామి, జెరిపోతుల సుధాకర్ పాల్గొన్నారు.

గంజాయికి వ్యతిరేకంగా పోరాడితే కేసులా?

- ఐక్య విద్యార్థి సంఘ నాయకుల ఆవేదన



కోర్టుకు హాజరైన విద్యార్థి సంఘ నాయకులు

జనగామ: గంజాయికి యువత బానిసలు కాకుం డా ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడితే పోలీసులు అక్రమ కేసులు పెట్టారని టీ జీవీపీ జిల్లా అధ్యక్షుడు గన్ను కార్తీక్, జిల్లా కార్యదర్శి తుంగ కౌశిక్ అన్నారు. నాలుగేళ్లుగా కోర్టు చుట్టూ తిరుగుతున్నామని వాపోయారు. గురువారం వారు జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ 2022లో జనగామ పట్టణంలో విచ్చలవిడిగా గం జాయి అమ్మకాలు జరుగుతున్న నేపథ్యంలో నిర్మూ లన కోసం తమ వంతు పోరాటం చేశామన్నారు. పిల్లలను కాపాడేందుకు ఐక్య ఉద్యమాలు చేస్తే పోలీసులు మాత్రం అక్రమ కేసులతో ఇలా కోర్టు చుట్టూ తిరిగేలా చేశారన్నారు. వారితో పాటు పట్టణ అధ్యక్షుడు వెంపటి అజయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్, ఎంఎస్ఎఫ్ ప్రతినిధి అనిల్ ధీరజ్, ప్రశాంత్, అనిల్‌చౌహాన్, అఖిల్ ఉన్నారు.

హక్కులు సాధించుకుందాం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య

లింగాలఘణపురం: కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడిన అమరుల స్ఫూర్తితో హక్కులు సాధించుకుందామని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, జిల్లా ప్రధాన కార్యద ర్శి వెంకటమల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని సిరిపురంలో అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్రలో భాగంగా గౌడకులస్తు లంతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మం డల అధ్యక్షుడు మహేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయా లని ఈనెల 18వరకు సామాజిక చైతన్య యాత్రలు నిర్వహించనున్నామన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, శంకరయ్య, భాస్కర్, లక్ష్మీనారాయణ, రాజు, ఉపేందర్, అనిల్, వెంకటేశ్ పాల్గొన్నారు. కల్లుగీత కార్మికుడు బస్వ గాని కుమార్‌కు నివాళి అర్పించారు.

ఉల్లాస్ నిరక్షరాస్యత ఖల్లాస్!

- నిరక్షరాస్యులైన అతివలు అక్షరాస్యత వైపు..
- ‘స్వయం సహాయక’ సభ్యులందరికీ చదువు
- జిల్లాల్లో టీచర్లకు శిక్షణ మరూ
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,61,613మంది నిరక్షరాస్యుల గుర్తింపు



మాట్లాడుతున్న జిల్లా సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబలైజింగ్ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి

విద్యారణ్యపురి: స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిదేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ‘ఉల్లాస్’ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ఇందులో భాగంగా ‘అందరికీ చదువు–అందరి బాధ్యత’ అనే నినాదంతో 1,61,613 మంది నిరక్షరాస్యులను గుర్తించారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను అక్షరాస్యులుగా మార్చాలనేది ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

అక్షరాస్యత ఇలా..

స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్యులైన మహిళలకు ముఖ్యంగా ఎఫ్ఎల్ఎన్ (ప్రాథమిక అక్షరాస్యత అభ్యసన సామర్థ్యాలు), జీవన నైపు ణ్యాలు, అలాగే సమాంతర విద్యను బోధిస్తారు. ఆ తర్వాత అర్హులకు 3, 5 తరగతులు, ఆపైన ఇప్పటికే చదువుకున్న వారికి ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్‌లో ప్రవేశాలు కల్పించేలా ప్రోత్సహిస్తారు.

టీచర్లకు శిక్షణ

ఉల్లాస్ కార్యక్రమం అమలులో భాగంగా ఇప్పటికే ప్రతి జిల్లా నుంచి ముగ్గురు రెగ్యులర్ టీచర్లకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 18 మంది టీచర్లు శిక్షణ పొందారు. రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశానుసారం గురువారం భూపాలపల్లి జిల్లాతోపాటు వరంగల్ రంగశాయి పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వయోజన విద్యాశాఖ ఉమ్మడి జిల్లా ప్రాజెక్టు అధికారి రమేశ్ రెడ్డి, హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి ఉపాధ్యాయులు, మండల రిసోర్స్ పర్సన్లకు శిక్షణ ఇచ్చారు. మిగిలిన మూడు జిల్లాల్లో వెనులుబాటును బట్టి శిక్షణ ఇవ్వ నున్నారు. ఈనెల 12న మండల స్థాయిలో ఒక టీచర్, అలాగే విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు శిక్ష ణ ఇవ్వనున్నారు. ఈనెల 19న గ్రామస్థాయిలో ఎం పిక చేసిన వలంటీర్ టీచర్లకు శిక్షణ పొందిన రెగ్యు లర్ టీచర్లతో శిక్షణ ఇవ్వనున్నారు.


సామాజిక చైతన్య కేంద్రాల ఏర్పాటు

గ్రామాల్లోని పాఠశాలల్లో సామాజిక చైతన్య కేంద్రా లను ఏర్పాటుచేస్తారు. ప్రతి 8 లే దా 10 మందికి ఒక వలంటీర్ విద్యాబోధన చేస్తారు. అంతేకాకుం డా టీవీ చానల్స్, ఉల్లాస్ యాప్, ఎస్సీఈఆర్‌టీఈ రూపొందించిన దీక్ష పోర్టల్ ద్వారా వయోజనులకు బోధన చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో నిరక్షరాస్యుల గుర్తింపు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, ములుగు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో ఉన్న స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్యు లైన మహిళలను ఇటీవల అధికారులు గుర్తిం చారు. వీరని అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ఆదిశగా వయోజన విద్య అధికారులు ముందుకు సాగుతున్నారు. వారి ని ఉల్లాస్ యాప్‌లో నమోదు చేస్తారు.

జిల్లాల వారీగా నిరక్షరాస్యులైన మహిళ వివరాలు



ఉల్లాస్ ప్రారంభానికి సన్నాహాలు..

స్వయం సహాయక సంఘాల్లోని 15 ఏళ్లపై బడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిది ద్దేందుకే ప్రభుత్వాలు ఉల్లాస్ (అండర్ స్టాండిం గ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఇన్ సొసైటీ) కార్యక్రమాన్ని ప్రారంభించనున్నాయి. ఆగస్టు –సెప్టెంబర్‌లో అధికారికంగా ఈ కార్యక్రమా న్ని ప్రారంభించేందుకు అధికారులు సన్నా హాలు చేస్తున్నారు.

రాఖీ అమ్మకాల జోరు!

- కొనుగోలుదారులతో దుకాణాల కళకళ
- రూ.2 నుంచి మొదలుకుని రూ.వెయ్యికి పైగా ధరలు
- రేపు రాఖీ పౌర్ణమి వేడుకలు





వివిధ రకాల డిజైన్లలో రాఖీలు



రాఖీలు కొనుగోలు చేస్తున్న యువతులు

జనగామ: అన్నాచెల్లెళ్లు, అక్కాత మ్ముళ్లు జరుపుకునే మహోత్తర మైన పండుగ రాఖీ. సోద రీసోదరుల అనురాగం, ఆప్యా యతలకు నిదర్శనమే ఈ పం డుగ. రాఖీ పౌర్ణమినే శ్రావణ, జం ధ్యాల పౌర్ణమి అని పిలుచుకుం టారు. అన్నా పండగకు వస్తున్నా..అం టూ చెల్లి పలకరింపు కోసం అన్నలు, అక్క ఎప్పు డొస్తుందోనని కంట్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూ సే తమ్ముళ్లు..ఇలా భారతీయ సంస్కృతి, సంప్ర దాయాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమిని ఈ నెల 9(శనివారం)వ తేదీన ఘనంగా జరుపుకోను న్నారు. పండుగ సమీపించడంతో జనగామ పట్టణం లోని కృష్ణాకళామం దిర్, గణేశ్‌వాడ, బస్టాం డ్, రైల్వేస్టేషన్, నెహ్రూ పార్కు, సిద్దిపేట రోడ్డులో రాఖీల దుకాణాలు కొనుగోలుదారుల తో కళకళలాడుతున్నాయి.

ఇళ్లలో మొదలైన సందడి..

రాఖీ పండుగ వచ్చిందంటే ఊరు, వాడ అంతా సం దడే. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతీఒక్కరు జరు పుకునే ఈ పండుగతో మార్కెట్ కూడా సందడిగా ఉంటుంది. జనగామ పట్టణంలోని దుకాణాల్లో రక రకాల రాఖీలు దర్శనమిస్తున్నాయి. గతంలో కంటే భిన్నంగా ఈసారి సృజనాత్మకతతో కూడిన రాఖీలు అందుబాటులో ఉన్నాయి. రూ.2 నుంచి మొద లుకుని రూ.250, రూ.300, రూ.500, రూ.1000లకు పైగా వరకు ధరలు పలుకుతు న్నాయి. ప్రతిఏటా శ్రావణమాసంలో వచ్చే రాఖీ పర్వదినాన్ని కులమతాలకతీతంగా దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు జరుపుకుంటారు. జనగామ జిల్లా కేంద్రంతో పాటు మండలాల పరిధిలో రాఖీల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

వైద్యం వికటించి మూడేళ్ల చిన్నారి మృతి

- తెలిసీతెలియని వైద్యం చేసి పాపప్రాణం బలిగొన్న ఆర్‌ఎంపీ
- మరిపెడలోని రవి క్లీనిక్ ఎదుట బంధువుల నిరసన, ఉద్రిక్తత


మణిదీప (ఫైల్)

మరిపెడ రూరల్: ప్రథమ చికిత్స కేంద్రంలో వైద్యం వికటించి మూడేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఉల్లెపల్లి గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తులు, బంధువుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొలిచెల్మ మల్సూర్, మహేశ్వరి దంపతులకు కూతురు మణిదీప (3)ఉంది. చిన్నారికి వరుసకు సోదరుడైన వ్యక్తికి గాయమైతే ఇటీవల మందులు తెచ్చి ఇంట్లో ఉంచారు. కాగా, బుధవారం సాయంత్రం మనిదీప ఇంట్లో ఆడుకుంటూ మందులు, ఆయింట్‌మెంట్ మిగింది. దీంతో బాలికకు వాంతులు అయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు మరిపెడలోని రవి క్లీనిక్ ప్రథమ చికిత్స కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ఆర్‌ఎంపీ రవిబాబు పాపను పరీక్షించి చికిత్స అందించాడు. బాగానే ఉందని రాత్రి 8 గంటలకు ఇంటికి పంపించాడు. మళ్లీ రాత్రి 10 గంటల సమయంలో చిన్నారికి వాంతులు ఎక్కువ కావడంతో సదరు ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఇంజక్షన్ వేసి అర్ధరాత్రి ఇంటికి పంపాడు, అయితే తెల్లవారుజామున చిన్నారి ఉలుకుపలుకు లేకపోవడంతో తల్లిదండ్రులు మళ్లీ ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లగా.. పాప ఆరోగ్య పరిస్థితి విషమించిందని, ఖమ్మం తీసుకెళ్లాలని సూచించారు. దీంతో వారు చిన్నారిని తీసుకొని ఖమ్మం వెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్‌ఎంపీ రవిబాబు నిర్లక్ష్య వైద్యం వల్లే పాప మృతి చెందిందని ఆగ్రహంతో ఉల్లెపల్లి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, బంధువులు అధిక సంఖ్యలో తరలివచ్చి రవి క్లీనిక్ ఎదుట ఆందోళనకు దిగారు. ఆర్‌ఎంపీపై దాడికి యత్నించారు. దీంతో గంటపాటు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఈక్రమంలో పోలీసులు ఆర్‌ఎంపీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయినప్పటికీ ఖమ్మం-వరంగల్ హైవేపై బైఠాయించి ధర్నా చేశారు. న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు నచ్చజెప్పడంతో ధర్నా విరమించారు. ఇదిలా ఉండగా తమకు బాబు పుట్టిన 18 ఏళ్ల తర్వాత మణిదీప పుట్టిందని తల్లి దండ్రులు బోరున విలపించారు.

మహిళా ఉద్యోగులకు ఒక పూట సెలవు

కేయూ క్యాంపస్: వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని కేయూ బోధన, బోధనేతర మహిళా ఉద్యోగులకు శుక్రవారం ఉదయం ఒక పూట సెలవు ప్రకటిస్తూ రిజిస్ట్రార్ వి.రామచంద్రం సర్క్యులర్ జారీచేశారు. మహిళా ఉద్యోగుల అభ్యర్థన మేరకు సెలవు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. మరో పూట మధ్యాహ్నం యథావిధిగా విధులకు హాజరుకావాలన్నారు.

చేతిలోనే సమస్త సమాచారం..

స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు.. కూర్చున్న చోటే క్షణాల్లో వివరాలు
- అందుబాటులో రైల్‌వన్, యూటీఎస్ యాప్‌లు
- రైల్వే సమాచారం కోసం ఇక నుంచి ఎటు వెళ్లాల్సిన అవసరం లేదు



ఖిలా వరంగల్: భారతీయ రైల్వే ప్రయాణికులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేవలు అందిస్తుంది. ఇందులో భాగంగా ట్రైన్‌లో ప్రయాణించాల్సిన వ్యక్తి ఇక నుంచి రైల్వే సేవలకు అటు ఇటు వెళ్లాల్సిన పనిలేదు. కావాల్సిన సమాచారమంతా కూర్చున్న చోటు నుంచే తెలుసుకునేలా అనేక యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో యూటీఎస్, రైల్ వన్ యాప్‌ల ద్వారా ప్రయాణికులకు క్షణాల్లో మెరుగైన సేవలు అందుతాయి. దీనికి కావాల్సింది చేతితో స్మార్ట్ ఫోన్ మాత్రమే. ఈ క్రమంలో ఈ రైలు యాప్‌లు ఎలాంటి సేవలు అందిస్తాయి.. ఎలా పొందాలనే అంశాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం

టికెట్‌కు ఇబ్బంది లేదు..

యూటీఎస్, రైల్ వన్ యాప్‌ల నుంచి టికెట్లు బుకింగ్ చేసుకోవచ్చు.అంతేకాదు అత్యవసరంగా అన్ రిజర్వ్‌డ్ టికెట్ కూడా వెంటనే కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ప్లాట్ ఫామ్ టికెట్ సైతం పొందొచ్చు. అలాగే, యాప్‌ల ద్వారా సాధారణ టికెట్ బుకింగ్, ప్లాట్ ఫామ్ టికెట్, నెలవారీ టికెట్, క్యాన్సలేషన్, టికెట్ హిస్టరీ, బుకింగ్ టికెట్ సమాచారం, ఆర్.వాలెట్, టికెట్ ప్రొఫైల్, టికెట్ ట్రాన్సాక్షన్, రైల్ లైవ్ లోకేషన్ మొత్తం యాప్‌ల ద్వారా సులభంగా తెలుసుకునేలా అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి.

రైళ్ల కోసం..

ఈ యాప్‌ల సేవలు అనేకం ఉన్నాయి. రైలు ప్రయాణం చేయాలనుకునే వారు రైల్ వన్, యూటీఎస్ యాప్‌ల ద్వారా వెళ్లాల్సిన ప్రాంతం, ఏ రైళ్లు అందుబాటులో ఉన్నాయని వెతికేందుకు సెర్చ్ ట్రైన్స్ బటన్ ఉంటుంది. ఏ ప్లాట్ ఫామ్‌పైకి రైలు వస్తుంది, కోచ్ పొజిషన్ ఎక్కడ ఉందో కూడా తెలుసుకోవచ్చు. రైలు ఎక్కడ ఉంది.. ఎప్పుడు వస్తుందని ట్రాక్ యువర్ ట్రైన్ ద్వారా తెలుసుకోవచ్చు.

రిజర్వేషన్ స్థితి..

ఈయాప్‌ల్లో టికెట్ రిజర్వేషన్ స్థితిని తెలుసుకోవడానికి కూడా అవకాశం కల్పించారు. ముందస్తు రిజర్వేషన్ టికెట్ స్థితి, సీటు కన్ఫర్మేషన్ స్టేటస్ తెలుసుకోవచ్చు. రైలు, రిజర్వేషన్ రద్దు, తదితర అంశాలనూ తెలుసుకోవచ్చు.

సీటు వద్దకే ఆహారం..

రైలు ఎక్కగానే ప్రయాణికులకు ఆహారం ఆర్డర్ చేసుకునే అవకాశం కల్పించారు. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం ద్వారా వివిధ రైల్వే స్టేషన్లకు చేరుకునేందుకు ముందే నచ్చిన ఆహారాన్ని ఆర్డర్ చేసుకుంటే రైలులో సీటు వద్దకే తీసుకొచ్చి ఇస్తారు.

సూచనలు, ఫిర్యాదులు..

ఏమైనా సూచనలు ఇవ్వాలనుకున్నా.. రైళ్లలో సమస్యలు తలెత్తినా ఫిర్యాదులు చేయడానికి రైల్ మదత్ విభాగం అందుబాటులో ఉంది. ఇందులో ఫిర్యాదు చేస్తే సమస్యలు పరిష్కారమవుతాయి. కాగా, వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి నిత్యం 80 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం సుమారు 8వేలకు పైగా మంది ప్రయాణిస్తుంటారు. ఫలితంగా ప్రతీ రోజు రైల్వేశాఖకు రూ.6లక్షలకు పైగా ఆదాయం సమకూరుతోంది.


రైల్వే యూటీఎస్ యాప్


రైల్ వన్ యాప్

డౌన్ లోడ్ ఇలా చేసుకోవాలి..

ఈ యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేయాలి. తర్వాత మొబైల్ నంబర్ లేదా మెయిల్ ఐడీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని పాస్‌వర్డ్ పెట్టుకోవడం ద్వారా ఉపయోగంలోకి వస్తుంది.

ఆడిందే ఆట!



- ఇన్‌చార్జ్‌ల చేతుల్లో రిజిస్ట్రేషన్ శాఖ
- ఉమ్మడి జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గాడి తప్పిన పాలన
- కిందిస్థాయి అధికారుల ఇష్టారాజ్యం
- పూర్తి స్థాయిలో అధికారులను నియమిస్తే సమస్యలు పరిష్కారం

కాజీపేట అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో రిజిస్ట్రేషన్ అండ్ చిట్స్ శాఖలోని ఉన్నతాధికారుల పాలన ఇన్‌చార్జ్‌ల చేతుల్లో కొనసాగుతోంది. ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా నిలిచే శాఖలో ఇన్‌చార్జ్ పాలనతో నిర్వహణ గాడి తప్పుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 13 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు 162 బ్రాంచ్‌లతో కూడిన చిట్‌ఫండ్ కార్యాలయాలపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ లేక కింది స్థాయి అధికారుల విధుల్లో అలసత్వం వహిస్తున్నారు. అడిగేవారు ఎవరూ లేకపోవడంతో ఆడిందే ఆటగా కొలువులు సాగిస్తున్నారు.

ప్రజల బారులు..

ఉమ్మడి జిల్లాలోని 13 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు చిట్స్, ఆడిటింగ్, కోర్టు కేసులు, ప్రొహిబిటెడ్, ల్యాండ్ కేసులు, డాక్యుమెంట్లలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి నిత్యం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రజలు బారులు దీరుతుంటారు. ఇక్కడ పని చేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ ఫణీందర్‌ను జులైలో హైదరాబాద్‌తో పాటు మహబూబ్‌నగర్ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. దీంతో కరీంనగర్ జిల్లా రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను ఉమ్మడి వరంగల్ ఇన్‌చార్జ్ నియమించారు. ఏడాది క్రితం ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా చిట్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా బదిలీపై వచ్చిన యామిని రెండు నెలల కాలవ్యవధిలో విధులు చేపట్టి నాటినుంచి నేటి వరకు లాంగ్ లీవ్‌లో వెళ్లిపోవడంతో ఇన్‌చార్జ్ చిట్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పాలనే కొనసాగుతోంది. దీంతో చిట్స్‌లో పేరుకుపోయిన చిట్‌ఫండ్స్ లావాదేవీలతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్ల విడుదల సైతం ప్రశ్నార్థకంగా మారింది.

పూర్తిస్థాయి అధికారులతోనే..

ఉమ్మడి జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు 162 చిట్‌ఫండ్‌ల పర్యవేక్షణకు పూర్తిస్థాయి అధికారులను నియమిస్తే తప్ప పాలన గాడిలో పడేలా లేదు. ప్రజలకు బాధలు తీరేలా లేవు. పదోన్నతుల కోసం కోర్టు మెట్లు ఎక్కిన జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్లకు పదోన్నతులు కల్పిస్తే పూర్తిస్థాయిలో అధికారులను నియమించే అవకాశం ఉంటుంది.

ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్ రైళ్లకు చైర్‌కార్స్ కోచ్‌లు

కాజీపేట రూరల్ : ప్రయాణికుల సౌకర్యార్థం కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే ఇంటర్ సిటీ, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు చైర్‌కార్స్ కోచ్‌లను పెంచుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం తెలిపారు.

12 నుంచి అమలు..

ఆగస్టు 12వ తేదీ నుంచి గుంటూరు-సికింద్రాబాద్ (12705) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు ఒక చైర్‌కార్, సికింద్రాబాద్-గుంటూరు (12706) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు ఒక 3ఏ (ఈ) కోచ్, ఆగస్టు 11వ తేదీ నుంచి సికింద్రాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్ (12757) కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌కు ఒక 3ఏ (ఈ) కోచ్, సిర్పూర్‌కాగజ్‌నగర్-సికింద్రాబాద్ (12758) కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌కు ఒక 3ఏ (ఈ) కోచ్‌ను పెంచుతున్నట్లు ఆయన తెలిపారు.

విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి

- ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్ భూపేంద్ర కుమార్


భారీ వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న విపత్తు బృందం, అధికారులు

నెల్లికుదురు: నిత్యం పరిసరాలను గమనిస్తూ ఒక్కసారిగా వచ్చే మెరుపు వరదలు, భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు, అగ్నిప్రమాదం లాంటి విపత్తులపై అప్రమత్తంగా ఉండాలని జాతీయ విపత్తు ప్రతి స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) కమాండర్ భూపేంద్ర కుమార్ సూచించారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం వావిలాల, ఆలేరు, మదనతుర్తి, మునిగలవీడు, రావిరాల, రాజులకొత్తపల్లి తదితర ప్రాంతాల్లో సంబంధిత అధికారులతో కలిసి గురువారం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం పర్యటించింది. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి విపత్తులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి బృందం వివరించింది. కాగా, గత సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలకు రావిరాలలో కొట్టుకుపోయిన రోడ్డును విపత్తు బృందం, అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో విపత్తు బృంద సభ్యులు మురళీరాథోడ్, మోహన్‌రావు, మండల ప్రత్యేకాధికారి జినుగు మరియన్న, తహసీల్దార్ చందానరేశ్, ఎంపీఓ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట




పరుగు పందెం పోటీని ప్రారంభిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, పరుగెత్తుతున్న చిన్నారులు


లాంగ్ జంప్ చేస్తున్న చిన్నారి

- చదువుతోపాటు ఆటల్లో రాణించాలి
- జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా
- అట్టహాసంగా రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం
- 33 జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు

జనగామ: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో గురువారం అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణగౌడ్ అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ (జావెలిన్, కిడ్స్) పోటీలకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. టోక్యో ఒలింపిక్స్‌లో నీరజ్ చోప్రా జావెలిన్‌త్రోలో బంగారు పతకం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఏటా ఆగస్టు 7వ తేదీన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జనగామలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలతో శారీరక ఆరోగ్యం, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి బైరెడ్డి వెంకటరెడ్డి, తెలంగాణ నిర్వహణ కార్యదర్శి పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి మనోజ్ కుమార్, కోశాధికారి ఆవుల అశోక్, నిర్వహణ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కిరణ్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు సుగుణాకర్, హనుమంతరావు, గజ్జెల్లి రాజు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

33 జిల్లాలు.. 6వందల మంది క్రీడాకారులు

జనగామ జిల్లా కేంద్రం ధర్మకంచ మినీ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు 33 జిల్లాల నుంచి 6 వందల మంది క్రీడాకారులు హాజరయ్యారు. జావెలిన్ క్రీడతోపాట అండర్-8,10,12 విభాగాల్లో బాల, బాలికలకు పరుగు పందెం, అప్రోచ్ లాంగ్ జంప్ క్రీడలు నిర్వహించారు. అండర్-8 విభాగంలో బాల, బాలికలకు 1.60 మీటర్ల పరుగు పందెం, ఐదు మీటర్ల అప్రోచ్ లాంగ్ జంప్, అండర్-10 విభాగంలో బాల, బాలికలకు 2.60 మీటర్ల పరుగు పందెం, ఐదు మీటర్ల అప్రోచ్ లాంగ్ జంప్, అండర్-12 విభాగంలో బాల, బాలికలకు 3.60 మీటర్లు ఫైవ్ మీటర్స్ అప్రోచ్డ్ లాంగ్ జంప్, కిడ్స్ జావెలిన్ త్రో, అండర్-14 విభాగంలో బాల, బాలికలకు కిడ్స్ జావెలిన్‌త్రో, అండర్-16,18, 20 విభాగాల్లో యువతీ, యువకులకు జావెలిన్ త్రో పోటీలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


కృష్ణ (ఫైల్)

మామునూరు: వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామానికి చెందిన గుండల కృష్ణ(45) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలో పనికి వెళ్లి తిరిగి రాత్రి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ముస్కులపల్లి బొడ్రాయి సమీపంలో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీ సడెన్ బ్రేక్ వేయగా.. వెనుక ఉన్న బైక్.. లారీని ఢీకొంది. దీంతో బైక్‌పై నుంచి రోడ్డు మీద పడిన కృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని హుటాహుటిన 108లో ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి తల్లి గుండల అమృతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మామునూరు ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు. కాగా, ఘటనా స్థలిని వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ పరిశీలించారు. ప్రమాద స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. మామునూరు ఏసీపీ వెంకటేశ్, ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఎస్సైలు కృష్ణవేణి, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరంతో మహిళ మృతి


అరుణ (ఫైల్)

వెంకటాపురం(కె): జ్వరంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని కమ్మరిగూడెంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పర్శిక అరుణ(31) జ్వరంతో బాధపడుతూ మూడురోజుల క్రితం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. అయినా తగ్గకపోవడంతో ఏటూరునాగారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా వైద్యులు పరీక్షలు నిర్వహించి డెంగీ జ్వరంగా నిర్ధారించి చికిత్స చేశారు. ఈ క్రమంలో గురువారం ఉదయం జ్వరం ఎక్కువ కావడంతో వెంకటాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది.

చావులోనూ వీడని బంధం..

- పది రోజుల వ్యవధిలో దంపతులు మృతి
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు


యాకయ్య(ఫైల్)

దుగ్గొండి : 60 ఏళ్ల పాటు కలిసి ఉన్నారు. అన్యోన్య దంపతులుగా జీవనం గడిపారు. పిల్లలందరూ ఎవరికి వారు బతుకుతున్నారు. కొంత కాలంగా వృద్ధాప్యంలో ఒకరికి ఒకరు తోడుగా ఉన్నారు. ఈ క్రమంలో పది రోజుల క్రితం భార్య అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి భర్త మనోవేదనకు గురవుతూ గురువారం కన్నుమూశాడు. ఈ ఘటన మండలంలోని తిమ్మంపేటలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోశాల యాకయ్య, సారమ్మ (75) దంపతులు. సారమ్మ పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి యాకయ్య (80) మనస్తాపానికి గురవుతున్నాడు. ఈ క్రమంలో సారమ్మ దశదిన కర్మ అనంతరం మరుసటి రోజు యాకయ్య తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందాడు. దీంతో పది రోజుల వ్యవధిలో తల్లిదండ్రులు ఇద్దరూ మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మరణంలోనూ యాకయ్య, సారమ్మ దంపతుల బంధం వీడలేదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. కాగా, ఈ దంపతులకు ఇద్దరు కుమారులు రాజేందర్, కృష్ణమూర్తి ఉన్నారు.

బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

జనగామ రూరల్: బీసీ బిడ్డలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. గురువారం జనగామలో నిర్వహించిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం కాదని, మతపరమైన రిజర్వేషన్లకు మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారా లేదా అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసి తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం పేరుతో కాంగ్రెస్ నాటకాలు ఆడుతోందని, అక్రమాలపై విచారణను సీబీఐకి ఎందుకు అప్పగించలేదని ప్రశ్నించారు. దీని వెనుక ఎవరికి ప్రయోజనం చేకూరుతుందో అర్థం అవుతోందన్నారు. బీఆర్‌ఎస్‌ను కాపాడేందుకే కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి బీజేపీని ఆదరించాలని కోరారు. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రంలో అనేక పథకాలు అమలవుతున్నాయన్నారు. రాష్ట్ర నాయకులు మూర్తినేని ధర్మారావు, బూర నర్సయ్య గౌడ్, గుండె విజయరామారావు, ఉపాధ్యక్షుడు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, లేగ రామ్మోహన్‌రెడ్డి , ఉడుగుల రమేశ్, కేవీఎల్ఎన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్, మాజీ అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులు..

- భర్తకు ఏడాది జైలు

వరంగల్ లీగల్ : అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేసిన ఘటనలో నేరం రుజువుకావడంతో భర్తకు ఏడాది జైలు శిక్ష, రూ.18 వేలు జరిమానా విధిస్తూ హనుమకొండ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శాంతిసోని గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామానికి చెందిన దొనికల అనూషకు భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామానికి చెందిన గుడ్డేటి దిలీప్‌కుమార్‌తో 2020, నవంబర్ 11న వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.40 లక్షలు, 30 తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. వివాహ అనంతరం కొద్ది రోజులు బాగానే చూసుకున్న దిలీప్‌కుమార్ కుటుంబీకులు తక్కువ కట్నం తెచ్చావంటూ అనూషను వేధించసాగారు. ఈ క్రమంలో ఉద్యోగ రీత్యా దిలీప్‌కుమార్.. భార్య అనుషాతో కలిసి 2021, జూలై 27న అమెరికా వెళ్లాడు. అక్కడ కూడా రూ. కోటి అదనపు కట్నం తీసుకురావాలని, లేనిపక్షంలో విడాకులు ఇస్తానని బెదించాడు. దీంతో అనూష.. దిలీప్‌కుమార్‌పై అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు మందలించి వదిలేశారు. అనంతరం 2022, జూలై 30న అనూష, దిలీప్‌కుమార్ ఇండియాకు తిరిగొచ్చారు. శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లిన దిలీప్‌కుమార్ తల్లిదండ్రులు అనూషను తీసుకుని బయలుదేరారు. మార్గమధ్యలో అనూష తల్లిదండ్రులు తాత్కాలికంగా ఉంటున్న ఘట్‌కేసర్ వద్ద ఆమెను వదిలి వెళ్లడానికి ప్రయత్నించారు. దీంతో అనూష ప్రశ్నించడంతో ఆమె తల్లిదండ్రుల ఎదుటే 'నీకు విడాకులు ఇస్తా' అని చెప్పి దిలీప్‌కుమార్‌తోపాటు కుటుంబీకులు స్వగ్రామం వచ్చారు. ఈ విషయంపై అనూష తల్లిదండ్రులు పంచాయితీ నిర్వహించగా విడాకులు తీసుకుంటానని దిలీప్‌కుమార్ పెద్దల సమక్షంలో చెప్పాడు. దీంతో చేసేదేమీ లేక అనూష మహిళా పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువుకావడంతో జడ్జి శాంతిసోని.. నేరస్తుడు దిలీప్‌కుమార్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.18 వేల విధిస్తూ తీర్పు వెలువరించారు.

రీజన్స్ లేకుండా రిజెక్టు చేయొద్దు..

- అధికారులు ఆర్టీఐకి భయపడొద్దు
- రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి, పక్కన రాష్ట్ర సమాచార కమిషనర్లు, కలెక్టర్

జనగామ: ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన సమాచారం కోసం దరఖాస్తు చేసుకుంటే కారణం లేకుండా రిజెక్ట్ చేయొద్దని.. ఒక వేళ చేసినా కారణం చెప్పాలని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, మొహిసినపర్వీన్, బోరెడ్డి అయోధ్యరెడ్డి, వైష్ణవి జనగామలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా.. డీసీపీ రాజమహేంద్రనాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఘనస్వాగతం పలికింది. అనంతరం కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. ప్రజల కోరిన మేరకు చట్టం ద్వారా సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బంది ఆర్టీఐకి ఎప్పుడూ భయపడొద్దన్నారు. ఈ చట్టం ద్వారా సమాచారం కోరిన 30 రోజుల వరకు సమయం ఉంటుందని, కారణం చూపకుండా గడువు దాటితే సంబంధిత అధికారి నుంచి పరిహారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు జవాబుదారి, పారదర్శకంగా ఉండాలన్నారు. దరఖాస్తుదారుడు సంతృప్తి చెందకపోతే అప్పీల్‌కు వెళ్లొచ్చన్నారు. గడువు లోగా సమాచారం ఇవ్వకపోతే స్టేట్ కమిషన్‌కు ఫిర్యాదు వెళ్తుందని, మొదటి అప్పీల్ జిల్లా అప్పీలేట్, రెండో అప్పీల్ స్టేట్ కమిషన్ వద్దకు వస్తుందన్నారు. సమాచారం ఇవ్వకపోవడంతో దరఖాస్తుదారుడు నష్టపోతే ఆ పరిహారాన్ని పీఐఓలు భరించాల్సి ఉంటుందన్నారు. జనగామ జిల్లాలో సహచట్టం ఫిర్యాదులు తక్కువగా వచ్చాయని ఆయన పేర్కొన్నారు. అయోధ్యరెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ఏ లక్ష్యంతో తీసుకొచ్చారో, దానికి అనుగుణంగా జిల్లా యంత్రాంగం పని చేయాలని చెప్పారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ జిల్లాలోని ప్రతీ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. మూడు, ఆరు నెలలకు ఇచ్చే నివేదికలను నిర్ణీత సమయానికి అందజేయాలన్నారు. అంతకు ముందు ఆయా శాఖల అధికారుల అభిప్రాయాలను తెలుసుకుని వాటికి సలహాలు, సూచనలు అందించారు.

విద్యార్థినిని వేధింపుల ఆరోపణలపై విచారణ

- కేఎంసీలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

ఎంజీఎం : కాకతీయ మెడికల్ కళాశాలలో ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్.. విద్యార్థినిపై వేధింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఆసిస్టెంట్ ప్రొఫెసర్‌పై అంతర్గత విచారణ జరుగుతున్న విషయం ఒక్కసారిగా బయటకు రావడంతో కేఎంసీ మరోమారు వార్తల్లో నిలిచింది. ర్యాగింగ్ కారణంగా డాక్టర్ ప్రీతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మరువక ముందే ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ తనను సహ విద్యార్థుల ఎదుట అసభ్యకరంగా అభివర్ణిస్తూ, వేధింపులకు పాల్పడుతున్నారని సైకియాట్రి విద్యార్థిని ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయడం తీవ్ర చర్చకు దారితీసింది. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా ప్రిన్సిపాల్ సంధ్య.. ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసిన విచారణ చేపట్టి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ముగ్గురు మహిళా ప్రొఫెసర్లు, ఇద్దరు ప్రొఫెసర్లతో కూడిన కమిటీ సభ్యులు మూడు రోజుల క్రితం బాధిత యువతితో పాటు సైకియాట్రి విభాగం విద్యార్థులను ప్రాథమికంగా విచారించారు. గురువారం ఉదయం బాధితురాలితోపాటు విద్యార్థులను పూర్తిస్థాయిలో విచారించిన కమిటీ.. సాయంత్రం ఆరోపణలు ఎదుర్కొంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను సైతం విచారించి పూర్తి వివరాలను క్రోడికరించి కమిటీ నివేదికను కేఎంసీ ప్రిన్సిపాల్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. కమిటీ నివేదిక ఆధారంగా శాఖాపరమైన చర్యలు చేపడుతామని ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య తెలిపారు.